నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 10 మే 2024 | HYDERABAD



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలా నగర్‌లోని ఓ టిఫిన్ సెంటర్‌లో పూరీలు వేస్తున్న మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఐదు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ..పాలన చేస్తున్నదని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఏఎస్‌రావునగర్, చర్లపల్లి డివిజన్లలో మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ వైపే ప్రజలు చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

-చర్లపల్లి, మే 9



ఎన్టీఆర్‌నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

### కాంగ్రెస్, బీజేపీలు అభివృద్ధిని పట్టించుకోలే..

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి**

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ప్రజల కోసం పనిచేసేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనన్నారు. 13న జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించేలా కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు.

### రాగిడిని గెలిపించాల్సిన బాధ్యత మనదే..

**-ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**

మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మనపైనే ఉన్నదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ప్రజలు ఆలోచించి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు.

### రేవంత్‌రెడ్డి చేసిందేమీలేదు

**-మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి**

మల్కాజిగిరి ఎంపీగా రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజలకు చేసిందేమీలేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. తనను గెలిపిస్తే మల్కాజిగిరి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



ఓల్డ్ అల్వాల్ యువ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి

# నీళ్లు ఇచ్చుడు.. చేతనైతలేదు

- మోదీ మాటలకు.. గ్యారెంటీ లేదు..
- పదేండ్లలో చేసిన అభివృద్ధి ఏమీలేదు
- జూన్ 2 తర్వాత..యూటీకి బీజేపీ కుట్ర
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఓల్డ్ అల్వాల్, కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ యువ సమ్మేళనాలు



మేడ్చల్/మల్కాజిగిరి: హైదరాబాద్‌ను జూన్ 2 తర్వాత కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలని బీజేపీ కుట్ర చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం ఓల్డ్ అల్వాల్‌లోని వీబీఆర్ ఫంక్షన్ హాల్‌లో యువ సమ్మేళనంలో కేటీఆర్ ప్రసంగిస్తూ.. హైదరాబాద్ యూటీ అయితే అభివృద్ధి ఆగిపోతుందన్నారు. ఈ కుట్రలను అడ్డుకోవాలంటే బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండాలన్నారు. ఐదు నెలల్లో రేవంత్‌రెడ్డి చేసిందేమీటంటే చిల్లర మాటలు, ఉద్దెర పనులని కేటీఆర్ అన్నారు. 'అర చేతిలో వైకుంఠం చూయించి.. చెప్పిదాంట్లో ఒక్కటైనా అమలు చేసి చూయించాడా' అని ప్రశ్నించారు. కరెంట్, నీళ్లు ఇచ్చుడు చేతనైతలేదు..కానీ విలన్లు చెప్పినట్లు డైలాగులు చెబుతున్నారన్నారు.

## రేవంత్‌రెడ్డివి చిల్లర మాటలు.. ఉద్దెర పనులు

### కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఏమిటంటే..

'కాంగ్రెస్ ఇస్తానన్న ఆరు గ్యారెంటీలు ఏమిటంటే..జనరేటర్లు, ఇన్వర్టర్లు, క్యాండిల్ లైట్లు, టార్చిలైట్లు, పవర్‌బ్యాంక్, చార్జింగ్ బల్బులు' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. హైదరాబాద్ గ్రేటర్ వాసులు కాంగ్రెస్ హామీలను నమ్మలేదని.. గ్రామాల్లోని ప్రజలు నమ్మి మోసపోయారన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు బాగుండే అని అనుకునేటోళ్లు బీఆర్ఎస్‌కు 10 నుంచి 12 ఎంపీ సీట్లు ఇస్తే..కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారని చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న కంపెనీలను కాపాడుకునే చేతనైతలేదని, ఇంకా కొత్త కంపెనీలు వచ్చే పరిస్థితి లేదన్నారు. పారిపాలన చేతకాని వాళ్లకు అవకాశం ఇస్తే నష్టపోయేది మనమేనన్నారు.

### మల్కాజిగిరి బరిలో నాన్‌లోకల్ అభ్యర్థులు

మల్కాజిగిరి పార్లమెంటు బరిలో నాన్‌లోకల్ అభ్యర్థులు నిలిచారని, వారికి ఇక్కడి ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. పొలిటికల్ టూరిస్టులు.. ఒకరు హుజురాబాద్, మరొకరు చేవెళ్ల నుంచి వచ్చారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాత్రమే ఎప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి.. ఢిల్లీలో తెలంగాణ గొంతుక వినపడేలా చూడాలని యువతకు కేటీఆర్ పిలుపునిచ్చారు. దయచేసి లాంగ్ వీకెండ్ ఉన్నదని, యువత ఓటు వేయకుండా ఉండవద్దని కేటీఆర్ సూచించారు. 'మీరు ఓటు వేయకపోతే మీకు ఇష్టం లేని లంగ, దొంగ నాయకులు రాజ్యమేలుతారు' అని అన్నారు. ఓటు హక్కును వినియోగించుకుని బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు.

## తెలంగాణ కోసం కొట్లాడేది బీఆర్ఎస్సే

కంటోన్మెంట్: తెలంగాణ రాష్ట్ర అవసరాల కోసం కొట్లాడేది కేవలం బీఆర్ఎస్ మాత్రమేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పదేండ్ల కింద మోదీ ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదని, మరోసారి ప్రజలను మోసం చేసేందుకు కొత్త హామీలతో బయలుదేరారని ఎద్దేవా చేశారు. హామీలు అమలు చేయకుండా యావత్ దేశం చెవిలో పువ్వులు పెట్టారని మండిపడ్డారు. ఇది వరకు ఇచ్చిన హామీలకే గ్యారెంటీ లేదని.. ఇప్పుడు చెప్పే మాటలకు ఏం గ్యారెంటీ ఉంటుందని ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధర తగ్గినా.... మోదీ మాత్రం పెట్రోల్ ధరలు తగ్గించకుండా డబుల్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేండ్లలో పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచి.. 30 లక్షల కోట్ల రూపాయలు ప్రజల నుంచి వసూలు చేశారని ధ్వజమెత్తారు. అలా వసూలు చేసిన 30 లక్షల కోట్ల రూపాయల నుంచి 14.5 లక్షల కోట్లు అంబానీ, అదానీల రుణాలను మాఫీ చేశారన్నారు. తన మాటలు నిజం కాదని కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్.. బీజేపీ నేతలు చెబితే.. తాను రాజీనామాకు సిద్ధమని కేటీఆర్ సవాల్ విసిరారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోదీ..పదేండ్లలో ఎన్ని ఉద్యోగాలు కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల ఆదాయాన్ని డబుల్ చేస్తామని చెప్పి.. వారిని నట్టేటా ముంచిన ఘనత బీజేపీ సర్కారుదేనని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపుతోందన్నారు. కులం, మతం ఆధారంగా ఓటు వేయొద్దని కోరారు. తెలంగాణ కోసం తెగించే కొట్లాడే బీఆర్ఎస్‌కే మద్దతివ్వాలన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ యువ ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగించారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు హామీల అమలు గురించి రేవంత్‌రెడ్డి నెలలు, తారీఖులు చెబుతున్నారని పేర్కొన్నారు.

రేవంత్ పాలనలో కొత్త పరిశ్రమలు రాకపోగా.. ఉన్నవి తరలిపోతున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అద్భుతంగా అభివృద్ధి చెందిందని కేటీఆర్ గుర్తుచేశారు. యాదాద్రి వంటి అద్భుతమైన ఆలయాన్ని నిర్మించామన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి ఆగిపోయిందని, ప్రజలంతా కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేదని గుర్తు చేస్తున్నారని చెప్పారు. నచ్చిన నాయకుడికి ఓటేయాలంటే.. యూత్ అంతా ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమ్మేళనంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే కృష్ణారావు, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

### ప్రాణం పోయినా.. సెక్యులరిజాన్ని వదిలిపెట్టం

బాలానగర్ : ప్రాణం పోయినా సరే...తాము సెక్యులరిజాన్ని వదిలిపెట్టేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. గురువారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ మల్లికార్జునకాలనీలో స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ నివాస సముదాయంలో ఏర్పాటు చేసిన మైనార్టీల సమావేశానికి కేటీఆర్‌తో పాటు మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో సర్వమతాలకు సమాన ప్రాతిపదికన సంక్షేమ పథకాలను అందించినట్లు గుర్తు చేశారు. పేద మైనార్టీ యువతుల వివాహాలకు ఆర్థిక సాయం అందించడం కోసం షాదీముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.



కంటోన్మెంట్ యువ సమ్మేళనంలో మద్దతు తెలుపుతున్న యువతీయువకులు



ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థులు రాగిడి లక్ష్మారెడ్డి, నివేదిత, కంటోన్మెంట్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి

## ఆలోచించి ఓటు వేయండి..

### ఎమ్మెల్యే తలసాని, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

బేగంపేట/ఉస్మానియా యూనివర్సిటీ/ఖైరతాబాద్ మే 9: సనత్‌నగర్ నియోజకవర్గంలోని బేగంపేట డివిజన్ పాటిగడ్డ, ఎంబీటీనగర్, వికార్‌నగర్, వడ్డెరబస్తీ, తబేలా ప్రాంతాల్లో గురువారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా మహిళలు మంగళహారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..ఎవరికి ఓటు వేస్తే మేలు జరుగుతుందో ఆలోచించి.. ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా ఉండి కూడా నియోజకవర్గ ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓటేసి మరోసారి మోసపోవద్దన్నారు. తార్నాక డివిజన్ మాణికేశ్వరీనగర్‌లోనూ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ విస్తృతంగా పర్యటించారు. ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. అలాగే రాత్రి ఖైరతాబాద్‌లో పద్మారావుగౌడ్ రోడ్‌షోను నిర్వహించారు. దానం నాగేందర్ పంజాగుట్టలో బీడీలు, సిగరేట్లు అమ్ముకునేవాడంటూ.. అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గ ప్రజల సమక్షంలో చేసిన వ్యాఖ్యలను మరిచిపోయినట్లు ఉన్నారని..ప్రభుత్వం మారగానే రేవంత్ కాళ్లపై పడ్డాడు' అంటూ.. పద్మారావుగౌడ్ ఈ రోడ్ షోలో దానం నాగేందర్‌ను ఎద్దేవా చేశారు.



బేగంపేట డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

## పాలన మరిచిన మంత్రులు

### ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, మే 9 : ప్రభుత్వంలో ఉంటేనే పని చేయాల్సిన అవసరం లేదని, ప్రతిపక్షంలో ఉన్నా.. కొట్లాడి సాధించే శక్తి ప్రజలు తనకు ఇచ్చారని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు మద్దతుగా గురువారం డివిజన్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ మంత్రులు పాలన మరిచి.. కేసీఆర్‌ను తిట్టడానికి పోటీపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



పునరుద్ధరించిన ట్రాన్స్‌ఫార్మర్ (కనెక్షన్ ఇవ్వలేదు)

## 48 గంటలుగా.. కరెంటు లేక

### ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరించినా.. ఇవ్వని కనెక్షన్

### అంధకారంలో పాపిరెడ్డికాలనీ

### నీళ్లు లేక.. బాత్‌రూమ్‌కు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు

కొండాపూర్, మే 9 : ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా 48 గంటలుగా కరెంటు లేక తీవ్ర అవస్థలుపడుతున్నారు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పాపిరెడ్డి కాలనీవాసులు. మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి కాలనీలోని చెట్లు, కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ విరిగిపడ్డాయి. అయితే కాలనీలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పునరుద్ధరించిన అధికారులు.. కనెక్షన్ ఇవ్వకపోవడంతో రెండ్రోజులుగా కాలనీ అంధకారంలో ఉంటున్నది. తారానగర్ సబ్‌స్టేషన్ అధికారులకు సమస్య విన్నవించుకున్నా.. ఎలాంటి స్పందన లేకుండాపోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంతకంటే ఎక్కువగా ఈదురు గాలులు, భారీ వర్షాలు పడ్డాయని, గంటల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించి, కరెంట్ సరఫరాను పునరుద్ధరించేవారని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

### బాత్‌రూమ్ వెళ్లేందుకు నీళ్లు లేవు

రెండు రోజులుగా పాపిరెడ్డి కాలనీలో కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఈదురు గాలులకు పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు పునరుద్ధరించారు. కానీ కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు. దీంతో పాటు కాలనీలో విరిగిపడిన చెట్లను తొలగించడం లేదు. పిల్లలు, వృద్ధులు మంచినీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బాత్‌రూమ్‌కు వెళ్లాలంటే.. నీళ్లు లేక అవస్థలుపడుతున్నారు. అధికారులకు అనేకసార్లు ఫోన్లు చేసినా.. స్పందించడం లేదు.

## పదేండ్లలో తొలిసారి..




మియాపూర్ , మే 9 : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కురిసిన భారీ వర్షానికి చెట్లు నేలకొరిగాయి..అవి విద్యుత్ తీగలపై పడటంతో కరెంటు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మియాపూర్ జేపీనగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు పడి పోవడంతో ప్లాట్ నంబర్ 130 –136 వరకు మూడు రోజుల పాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ సిబ్బంది ఎట్టకేలకు గురువారం రాత్రి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అయితే మూడు రోజుల పాటు కరెంటు లేక నరకం చూసినట్లు కాలనీ వాసులు వాపోయారు. మరోవైపు మదీనాగూడలోని ఉషోదయ ఎన్‌క్లేవ్ కాలనీలోనూ గాలి వానకు చెట్లు, విద్యుత్ తీగలు పడిపోయాయి. ఇక్కడ కూడా సరఫరా నిలిచిపోవడంతో కాలనీ వాసులు అనేకసార్లు విద్యుత్ శాఖ, జీహెచ్ఎంసీ అధికారులకు తమ బాధను మొరపెట్టుకున్నారు. అయితే, విరిగిన కొమ్మల తొలగింపు, విద్యుత్ పునరుద్ధరణలో రెండు శాఖలు తీవ్ర జాప్యం చేశాయని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖలకు సంబంధించిన ఫోన్లకు ఎవరూ సమాధానం ఇవ్వడంలేదని....విద్యుత్ లేక చీకట్లో నానా ఇబ్బందులు పడాల్సి వచ్చిందని పేర్కొంటున్నారు. ప్రధానంగా చిన్నారులు , వృద్ధులు, గర్భిణులు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చిందని కాలనీవాసులు పేర్కొన్నారు. గత పదేండ్లలో ఇలాగా అనేకసార్లు ఈదురుగాలులు, భారీ వర్షాలు వచ్చి.. చెట్ల కొమ్మలు విరిగి...విద్యుత్ లైన్లు తెగిపడ్డ సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయని, అయితే రోజుల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ఘటనలు మాత్రం లేవని.. కాలనీకి చెందిన ప్రముఖ ఐటీ కంపెనీ నిర్వాహకుడు గుండవెల్లి ప్రణిత్ పేర్కొన్నారు. గతంలో సంబంధిత శాఖలు శ్రమించి..రాత్రికి రాత్రే విద్యుత్‌ను పునరుద్ధరించే పరిస్థితిని పదేండ్లలో చూశామని, ప్రస్తుతం అందుకు భిన్నంగా పనులు ఉన్నాయని చెప్పారు. వాతావరణ పరిస్థితులతో గాలివాన సహజమే అయినా ...దానిని ఎదుర్కునేలా...ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం సిద్ధం లేకపోవడం వల్లే ఇబ్బందులు నెలకొన్నాయన్నారు.